


మనం

కడప | అన్నమయ్య



కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయం

వివరాలు 5లో


ఏకగ్రీవాల్లో కూటమి జోరు.. బ్యాలెట్ తీర్పులో ఎవరి హవా!

పురపీఠాలపై పట్టు ఎవరిది? నేడే రాజకీయ ఆధిపత్యానికి అసలైన పరీక్ష

పులివెందులపై ప్రత్యేక ఉత్కంఠ.. కడప కార్పొరేషన్‌పై అందరి చూపు

ఏకగ్రీవాలతో కూటమి ముందంజ.. ప్రత్యక్ష పోరులో వైసీపీ సత్తాకు పరీక్ష

కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత.. ఫలితాల అనంతరం పరిణామాలపై పోలీసుల నిఘా



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 2

వైఎస్సార్ కడప జిల్లా రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి తెరలేవనుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు జిల్లా రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయనున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో జరిగిన పురపోరు అధికార కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రతిష్టాత్మక పోరుగా మారింది. నామినేషన్ల దశలోనే పలు పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో పెద్ద సంఖ్యలో స్థానాలు ఏకగ్రీవం కావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే ఏకగ్రీవాల ఆధిక్యమే ప్రజాబలానికి కొలమానమా? ప్రత్యక్షంగా పోలింగ్ జరిగిన వార్డుల్లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా పులివెందుల, కడప నగరపాలక సంస్థ ఫలితాలు జిల్లా రాజకీయాల్లో కీలక మలుపునకు నాంది పలుకుతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికలు కేవలం మున్సిపల్ పీఠాల కోసం జరిగిన పోరు మాత్రమే కాదు.. జిల్లాలో రాజకీయ ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు సాగిన నాయకత్వ పరీక్ష కూడా. చంద్రబాబు, లోకేష్ వ్యూహాలకు క్షేత్రస్థాయిలో ఎంతటి మద్దతు లభించింది? వైఎస్ జగన్ నాయకత్వంలో వైసీపీ తన సంప్రదాయ రాజకీయ పునాదులను ఎంతవరకు కాపాడుకుంది? అన్న ప్రశ్నలకు ఫలితాలు సమాధానం చెప్పనున్నాయి. ఏకగ్రీవాలతో వచ్చిన ఆధిక్యాన్ని ప్రత్యక్ష ఎన్నికల ఫలితాలు మరింత బలోపేతం చేస్తాయా? లేక కొన్ని ప్రాంతాల్లో అనూహ్య ఫలితాలతో రాజకీయ సమీకరణాలు మారిపోతాయా? అన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు గత ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఫలితాల ప్రకటనతో పాటు విజయోత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా పెంచింది.

పులివెందుల.. ప్రతిష్ఠకు ప్రతీక!

వైఎస్ కుటుంబానికి రాజకీయ కంచుకోటగా పేరున్న పులివెందులలో ఈసారి ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న వివాదాలు, జగన్ ప్రత్యక్షంగా రంగంలోకి దిగిన పరిణామాలు పోరును మరింత ప్రతిష్ఠాత్మకంగా మార్చాయి. వైఎస్ అవినాష్ రెడ్డి వ్యూహాలకు, టీడీపీ నేత బీటెక్ రవి రాజకీయ పట్టుకు ఈ ఫలితాలు పరీక్షగా నిలవనున్నాయి. ఇక్కడి తీర్పు స్థానిక రాజకీయాలకే పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయ చర్చల్లోనూ ప్రాధాన్యం సంతరించుకోనుంది.

కడప కార్పొరేషన్.. మేయర్ పీఠంపై పోరు!

66 డివిజన్లతో కూడిన కడప నగరపాలక సంస్థపై కూటమి ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పెద్ద సంఖ్యలో డివిజన్లు ఏకగ్రీవం కావడంతో మేయర్ పీఠంపై కూటమి ఆశలు పెరిగాయి. ఎమ్మెల్యే మాధవిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి వ్యూహాలు ఎంతవరకు ఫలించాయన్నది తేలనుంది. మరోవైపు ఎంపీ అవినాష్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ తన ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నించింది. కడప నగర రాజకీయాల్లో ఎవరి ఆధిపత్యం కొనసాగనుందో ఫలితాలు స్పష్టం చేయనున్నాయి.

ప్రొద్దుటూరు.. వరదరాజుల రెడ్డి వ్యూహాలకు పరీక్ష

ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో కూటమి సాధించిన ఏకగ్రీవాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వర్గానికి ఈ పరిణామాలు సవాలుగా మారాయి. పట్టణంలో టీడీపీ ఆధిపత్యం మరింత బలపడిందా అన్నది ఈ ఎన్నికల రాజకీయ సందేశంగా నిలవనుంది.

కమలాపురం.. పుత్తా పట్టు నిలిచేనా?

ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి నాయకత్వంలో కమలాపురంలో కూటమి ఏకగ్రీవాల ద్వారా పైచేయి సాధించింది. స్వప్నకు చైర్‌పర్సన్ పీఠం దక్కే దిశగా పరిస్థితులు అనుకూలంగా కనిపిస్తున్నాయి. ఈ విజయం స్థానికంగా పుత్తా రాజకీయ బలాన్ని మరోసారి చాటుతుందా అన్నది ఆసక్తికరం.

మైదుకూరు.. హోరాహోరీ పోరు!

మైదుకూరులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వర్గాల మధ్య రాజకీయ పోరు ఆసక్తికరంగా మారింది. జగన్ మోహన్ అభ్యర్థిత్వం చుట్టూ సాగిన ప్రచారం, ప్రత్యర్థుల వ్యూహాలు ఓటర్ల తీర్పుతో తేలనున్నాయి. ఇక్కడి ఫలితాలు నియోజకవర్గ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపనున్నాయి.

యర్రగుంట్ల..ఆదినారాయణరెడ్డి ఆధిపత్యానికి మరో పరీక్ష

యర్రగుంట్లలో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గం రాజకీయ ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నించింది. మధులత చైర్‌పర్సన్ పీఠం దిశగా సాగిన పరిణామాలు కూటమి స్థానిక బలాన్ని ప్రతిబింబించనున్నాయి. జమ్మల మడుగు పరిసరాల్లోనూ ఫలితాలపై ఉత్కంఠ కొనసాగుతోంది.

బద్వేలు.. ఏకగ్రీవాలే రాజకీయ సందేశం!

40 వార్డులకు గాను 39 స్థానాలు ఏకగ్రీవం కావడం బద్వేలు రాజకీయాల్లో కీలక పరిణామం. ఎమ్మెల్యే బొజ్జా రోశన్న నేతృత్వంలో కూటమి సాధించిన ఈ ఆధిక్యం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. దివ్యతేజకు చైర్‌పర్సన్ బాధ్యతలు దక్కే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

గతంలో చోటుచేసుకున్న రాజకీయ ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా కడప, పులివెందుల ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు కఠినంగా అమలు చేస్తూ, ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీల సమయంలో ఘర్షణలు జరగకుండా నిఘా ఏర్పాటు చేశారు.

ఫలితాలే రాజకీయ భవిష్యత్తుకు దిక్సూచి!

ఈ పురపోరు ఫలితాలు ఎవరు ఎన్ని పీఠాలు గెలుచుకున్నారనే లెక్కలకే పరిమితం కావు. జిల్లాలో కూటమి పట్టు ఎంత బలపడింది? వైసీపీ తన సంప్రదాయ ప్రాంతాల్లో ఎంతవరకు నిలబడింది? స్థానిక నాయకుల వ్యూహాలు ఎంతవరకు ఫలించాయి? అన్న అంశాలకు సమాధానంగా నిలవనున్నాయి. ఏకగ్రీవాలతో మొదలైన కూటమి ఆధిక్యం ప్రత్యక్ష ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిబింబిస్తే జిల్లాలో రాజకీయ ఆధిపత్యానికి కొత్త నిర్వచనం ఏర్పడుతుంది. లేదంటే కొన్ని ప్రాంతాల ఫలితాలు కూటమి శ్రేణులకు ఆత్మపరిశీలన అవసరాన్ని గుర్తుచేయవచ్చు. మొత్తానికి పురపీఠాల పోరు ముగిసినా.. కడప రాజకీయాల్లో అసలైన ఆధిపత్య పోరుకు ఈ ఫలితాలే కొత్త ఆరంభం కానున్నాయి.



కడప జిల్లాకు "మురసు" తుపాను ముప్పు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. యంత్రాంగానికి కలెక్టర్ హై అలర్ట్



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 2: బంగాళాఖాతంలో ఏర్పడిన "మురసు" తుఫాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా పటిష్ట ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువు కట్టలు, కాలువలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే పరివాహక ప్రాంత ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, మందులతో పాటు గర్భిణులు, బాలింతల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే అధికారులు, సిబ్బంది 24 గంటలు విధి నిర్వహణలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సహాయం అవసరమైన వారు ల్యాండ్‌లైన్ నంబర్ 08562-246344, మొబైల్ నంబర్ 9849904124ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అధికారిక సూచనలు పాటించాలని, వాగులు, వంకలు, నదుల వంటి ప్రమాదకర ప్రదేశాలకు ఎవరూ వెళ్లరాదని ఆయన విజ్ఞప్తి చేశారు.

కులమతాలకు అతీతంగా గుత్తి నరసింహ ప్రచారజోరు


వర్షాన్ని సైతం లెక్కచేయని అభిమానులు.. చిన్ననాటి స్నేహితుడికి అండగా నానబాల నాగార్జున

భారీ జనసందోహంతో సందడిగా ఎన్నికల ప్రచారం





చిట్వేలీ నవంబర్ 2 మనం న్యూస్: ఒకవైపు మురసు తుపాను ప్రభావం, మరోవైపు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం సోమవారం హోరాహోరీగా సాగుతున్న నేపథ్యంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చిట్వేలీ జెడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి గుత్తి నరసింహ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రజలను కలుస్తూ ముందుకు సాగారు. ఆయనకు చిన్ననాటి స్నేహితుడు నానబాల నాగార్జునతో పాటు చిట్వేలి మండలంలోని 21పంచాయతీ పరిధిలోని ప్రజలు, యువత, స్థానిక ప్రజలు భారీసంఖ్యలో స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటూ గుత్తి నరసింహకు మద్దతు తెలిపారు. ముందుగా బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్ నందు ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ సర్కిల్ నుండి కొత్త బస్టాండ్, అలాగే సింగమాల వీధి, కుమ్మరి వీధి, సత్యమ్మ వీధి నందు ప్రచారం కొనసాగించారు. అడుగడుగున ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. భారీ సంఖ్యలో ప్రజలు, యువత, స్థానిక నాయకులు పాల్గొనడంతో ప్రచార ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితుడైన గుత్తి నరసింహకు నానబాల నాగార్జున అండగా నిలుస్తూ ప్రచార బాధ్యతలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలను కలుస్తూ ఏసీ



గుర్తుకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. కష్టసుఖాల్లో తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని తన చొరవతో చాటిచెబుతున్నారు. మరోవైపు చిట్వేలీ సింగమల దర్గా వీధిలో గతంలో వర్షపు నీరు నిలిచి ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, ప్రస్తుతం పరిస్థితిలో వచ్చిన మార్పులపై స్థానికులు చర్చించుకుంటున్నారు. స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థులపై పార్టీ పరమైన హెచ్చరికలు వస్తున్నాయని ప్రచార వర్గాలు పేర్కొంటుండగా, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతామని గుత్తి నరసింహ మద్దతుదారులు చెబుతున్నారు.

కులమతాలకు అతీతంగా ప్రజలతో ఉన్న అనుబంధం, స్నేహితుల సహకారం, యువత భాగస్వామ్యంతో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 90 శాతం ప్రచారం పూర్తయినట్లు ప్రచార వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు, కూటమి నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మురసు తుపాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు -సిద్ధవటం తహసీల్దార్ విజయ్ కుమార్

సిద్ధవటం, నవంబర్ 2 మనం న్యూస్: మురసు తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్ధవటం తహసీల్దార్ ఆర్.విజయ్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలా వస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తహసీల్దార్ విజయ్ కుమార్ కోరారు.

అయ్యప్ప మాల భక్తులకు అన్న సంతర్పణ

గురుస్వామి పుత్తా ఎల్లయ్య



సిద్ధవటం నవంబర్ 2 మనం న్యూస్ : బాకరాపేట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం భాకరాపేట గ్రామానికి చెందిన కాడే రామకృష్ణ కుటుంబీకులు 80 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాలు సమకూర్చారు.ఈ సందర్భంగా అయ్యప్ప మాల గురుస్వామి పుత్తా ఎల్లయ్య మాట్లాడుతూ ప్రతిరోజు మధ్యాహ్నం, కొంతమంది భక్తుల సహకారంతో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాలు, ఏర్పాటు చేస్తున్నామని 30 తేదీన రాత్రికి అయ్యప్ప స్వాములుచే పడిపూజ కార్యక్రమం నిర్వహించి డిసెంబర్ 11 న శబరిమలై కొండకు బయలుదేరుతామని తెలిపారు అయ్యప్ప మాల ధరించిన భక్తులు, కఠినమైన నిష్టతో ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు

తుమ్మకొండ ఎంపీటీసీ అభ్యర్థిగా సుకరాజు సందీప్ యాదవ్

టార్చ్‌లైట్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి



చిట్వేలీ నవంబర్ 2 మనం న్యూస్: చిట్వేల్ మండలం తుమ్మకొండ ఎంపీటీసీ అభ్యర్థిగా భారత చైతన్య యువజన పార్టీ బీసీవై తరఫున సుకరాజు సందీప్ యాదవ్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన టార్చ్‌లైట్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అభ్యర్థి నూకరాజు సుదీప్ యాదవ్ తెలిపారు. గ్రామలలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని తెలియజేస్తున్నారు. ఈ ఎన్నికల్లో టార్చ్‌లైట్ గుర్తును గుర్తించి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా కువైట్ ఎన్నారై బిసివై పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఆవులకుంట వెంకటేష్, బీసీవై పార్టీ ఎన్నారై వింగ్ కన్వీనర్ చల్లకంచు రామకృష్ణ యాదవ్ అభ్యర్థి నూకరాజు సందీప్ కు మద్దతుగా నిలిచినట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు..!

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

జిల్లాలో ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 172 వార్డులకు ఓట్ల లెక్కింపు

ఓట్ల లెక్కింపునకు 18 రూములు, 159 టేబుళ్లు ఏర్పాటు



కడప, నవంబర్ 2 మనం న్యూస్

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 172 వార్డులకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అవసరమైన గదులు, కౌంటింగ్ టేబుళ్లు, కౌంటింగ్ సిబ్బంది, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేసినట్లు వివరించారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి మొత్తం 2,82,176 మేయర్, చైర్‌పర్సన్‌ఓట్లు, 1,13,348 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు చేపట్టాల్సి ఉందని తెలిపారు. మేయర్, చైర్‌పర్సన్ ఓట్ల లెక్కింపునకు ఐదు గదుల్లో 84 టేబుళ్లను ఏర్పాటు చేశామని, దీనికి సంబంధించి మొత్తం 12 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అదేవిధంగా వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు 13 గదుల్లో 75 టేబుళ్లను ఏర్పాటు చేశామని, మొత్తం 36 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

మున్సిపాలిటీల వారీగా లెక్కింపు ఏర్పాట్లు

బద్వేలు పట్టణానికి సంబంధించి 1,320 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో ఒక గది, ఒక టేబుల్ ఏర్పాటు చేసి రెండు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో 32 వార్డులకు సంబంధించి మేయర్, చైర్‌పర్సన్ ఓట్ల లెక్కింపునకు 30,206 ఓట్లు ఉండగా, ఒక గదిలో ఎనిమిది టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల 26,560 ఓట్ల లెక్కింపునకు రెండు గదుల్లో 16 టేబుల్స్ ఏర్పాటు చేసి రెండు విడతల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), ముద్దనూరు రోడ్డును లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కడప నగరపాలక సంస్థ పరిధిలో 66 వార్డులకు సంబంధించి మేయర్ ఓట్ల లెక్కింపునకు 2,13,488 ఓట్లు ఉండగా, మూడు గదుల్లో 66 టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల 42,640 ఓట్ల లెక్కింపునకు ఒక గదిలో 14 టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఇందుకు ఎంఏఎన్‌యూ పాలిటెక్నిక్ కళాశాలను లెక్కింపు కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

మైదుకూరు పట్టణంలో 15వార్డులకు సంబంధించి 12,491 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఒక గది, 16 టేబుల్లను ఏర్పాటు చేసి 13 విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.


పులివెందుల పట్టణంలో 40వార్డులకు సంబంధించి మేయర్, చైర్‌పర్సన్ ఓట్ల లెక్కింపునకు 38,482 ఓట్లు ఉండగా, ఒక గదిలో 10 టేబుల్లను ఏర్పాటు చేసి నాలుగు విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల 18,566 ఓట్ల లెక్కింపునకు ఒక గదిలో 10 టేబుల్లను ఏర్పాటు చేసి రెండు విడతల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను.. ముద్దనూరు రోడ్డులోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాజంపేట పట్టణంలో 17వార్డులకు సంబంధించి 11,065 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు జెడ్పీ ఉన్నత పాఠశాల, మన్నూరు వద్ద ఆరు గదుల్లో 17 టేబుల్లను ఏర్పాటు చేసి 12 విడతల్లో లెక్కింపు చేపట్టనున్నట్లు వివరించారు. ఎర్రగుంట్ల పట్టణంలో ఒక వార్డుకు సంబంధించి 706 వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపునకు ముద్దనూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒక గది, ఒక టేబుల్ ఏర్పాటు చేసి ఒక విడతలో లెక్కింపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.


కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతున్నట్లు జిల్లాకలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఎంట్రీ కంట్రోలింగ్, ఐడి తనిఖీలు, అవసరమైన బారికేడ్ల ఏర్పాటు వంటి చర్యలను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు నిరంతర నిఘా కొనసాగించేలా సంబంధిత పోలీసు యంత్రాంగం, సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

మూడు గ్రామపంచాయతీల్లో టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి పోలి వెంకట సుబ్బారెడ్డి విస్తృత ప్రచారం







రాజంపేట, నవంబర్ 2: మనం న్యూస్ రాజంపేట మండలంలోని ఎం.జి.పురం, బోయినపల్లి, పెద్ద కారంపల్లి గ్రామపంచాయతీల పరిధిలో తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి పోలి వెంకట సుబ్బారెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ

సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి

ఓటర్లను కలుసుకుని తనకు మద్దతు తెలపాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని, అలాగే ఇతరులతో కూడా సైకిల్ గుర్తుకు ఓట్లు వేయించాలని ఓటర్లను కోరారు. ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణే ప్రతి ఒక్కరి బాధ్యత

పర్యావరణ హిత జీవనశైలికి విద్యార్థుల ప్రతిజ్ఞ



చిట్వేలీ నవంబర్ 2 మనం న్యూస్: పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చిట్వేలీ రేంజ్ అటవీ శాఖ అధికారి ధీరజ్ ఆధ్వర్యంలో ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవం మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా చిట్వేలీ అటవీ ప్రాంత పరిధిలోని తిరుపతి జిల్లా సరిహద్దు నుంచి కూటలమర్రి రహదారి వరకు చిట్వేలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అటవీ శాఖ సిబ్బంది ప్రకృతి నడక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యార్థులకు ప్రకృతి ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ, సహజ వనరుల పొదుపు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చిన్న చిన్న మార్పులతోనే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలియజేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పాటు చిట్వేలీ అటవీ శాఖ సిబ్బంది మిషన్ లైఫ్ ప్రతిజ్ఞ స్వీకరించారు. పర్యావరణానికి హాని కలిగించని జీవనశైలిని అలవర్చుకుంటామని, నీరు, విద్యుత్ వంటి సహజ వనరులను వృథా చేయకుండా పొదుపుగా వినియోగిస్తామని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చదనంతో కూడిన ప్రకృతిని అందించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పిందన్నారు. ప్రకృతితో మమేకమై సాగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్, ఫారెస్ట్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ముక్కావారిపల్లి పంచాయతీలో జోరుగా ఎన్నికల ప్రచారం


జడ్పీటీసీ అభ్యర్థి కవిత కి మద్దతుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్,ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లి, నవంబర్ 2 మనంన్యూస్: ఓబులవారిపల్లి మండలం ముక్కావారిపల్లి పంచాయతీ పరిధిలోని సంజీవపురం, గొల్లపల్లి (అమృతవారిపల్లి), హరిజనవాడ గ్రామాల్లో జడ్పీటీసీ అభ్యర్థి కవిత గారికి మద్దతుగా విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈప్రచార కార్యక్రమంలో రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపి పార్టీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి పాల్గొని స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.

ప్రజలతో మమేకమవుతూ కవితని జడ్పీటీసీగా గెలిపించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల మద్దతు కోరుతూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు.








కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయం

రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు – పులపత్తూరు పంచాయతీలో జోరుగా ఎన్నికల ప్రచారం

గ్రామ, మండల సమగ్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యమని స్పష్టీకరణ

రాజంపేట, మనం న్యూస్ నవంబర్ 02: గ్రామాలు మరియు మండలాల సమగ్ర అభివృద్ధి కేవలం ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపు నిచ్చారు. రాజంపేట మండలం పులపత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో ఆయన సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


స్థానిక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో కూటమి తరపున రాజంపేట మండల జడ్పీటీసీ అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి, పులపత్తూరు ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమతి కలిశెట్టి సౌజన్యలను



గెలిపించాలని కోరుతూ చమర్తి జగన్ మోహన్ రాజు ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి, మండల సర్వతో ముఖాభివృద్ధికి నిరంతరం ప్రజల్లో ఉండే అభ్యర్థులనే ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. పోలి సుబ్బారెడ్డికి, కలిశెట్టి సౌజన్యకు ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటు వేసి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థులకు, నాయకులకు స్థానిక ప్రజలు, మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.


ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం






రాజంపేటలో యల్లటూరు శ్రీనివాసరాజు ప్రచారానికి బ్రహ్మరథం



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 2

రాజంపేట మండలంలో కూటమి తరపున పోటీ చేస్తున్న జడ్పీటీసీ అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి, ఊటుకూరు ఎంపీటీసీ జనసేన అభ్యర్థి పెడకాల సుధాకర్‌ల సంపూర్ణ విజయమే లక్ష్యంగా రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు చేపట్టిన ఊటుకూరు ఎన్నికల ప్రచార కార్యక్రమం విజయ వంతంగా సాగింది. గ్రామీణ ప్రాంతాల సమగ్ర ప్రగతి కూటమి అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమని స్పష్టం చేస్తూ ఆయన ఊటుకూరులో విస్తృతంగా పర్యటించారు. యల్లటూరు శ్రీనివాసరాజు అడుగుపెట్టిన ప్రతిచోటా స్థానిక ప్రజలు, ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. ప్రజల నుంచి లభించిన అపూర్వ ఆదరణతో ప్రచార ప్రాంగణమంతా కూటమి విజయనాదాలతో హోరెత్తింది. ఈ కార్యక్రమంలో యల్లటూరు శ్రీనివాసరాజు నేతృత్వంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు మరియు వీర మహిళలు భారీ సంఖ్యలో కదం తొక్కారు. కూటమి శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతూ యల్లటూరు



మాట్లాడుతూ.. ప్రజాసేవకే అంకితమైన జడ్పీటీసీ అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి పెడకాల సుధాకర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రజల నుంచి వస్తున్న ఈ అఖండ మద్దతే కూటమి అభ్యర్థుల గెలుపునకు నిదర్శనమని, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి చారిత్రాత్మక విజయాన్ని అందించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

రోహిత్ వర్సెస్ కోహ్లీ: ఎవరు సెంచరీ చేస్తారు? పుజారా అంచనా ఇదే..!

కోహ్లీకి సెంచరీ అవకాశాలు ఎక్కువన్న పుజారా

మూడో స్థానంలో బ్యాటింగ్ కోహ్లీకి కలిసొస్తుందని వ్యాఖ్య

న్యూజిలాండ్‌లో రోహిత్ పాత్ర మారొచ్చని అంచనా

ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని జోస్యం

న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యం ఉంటుందని అభిప్రాయం



న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ కంటే విరాట్ కోహ్లీకి సెంచరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లీ మూడో స్థానంలో రావడం అతడికి ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే అవకాశం కల్పిస్తుందని చెప్పాడు. అదే సమయంలో ఓపెనర్‌గా రోహిత్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుందని, న్యూజిలాండ్ పిచ్‌లపై అతడి పాత్రలో మార్పు ఉండొచ్చని పేర్కొన్నాడు. జియోస్టార్‌తో మాట్లాడిన పుజారా.. "రోహిత్ సాధారణంగా పవర్‌ప్లేలో జట్టుకు మంచి ఆరంభం అందించడంపై దృష్టి పెడతాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో అతడి పాత్ర మారవచ్చు. అయితే కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. ఇన్నింగ్స్‌ను నిలబెట్టి ఆడటం అతడి ఆటతీరులో కీలకం. ఈ స్థానంలో వచ్చే బ్యాటర్‌కు వన్డేల్లో సెంచరీ చేసే అవకాశం కొంత ఎక్కువగా ఉంటుంది. అందుకే రోహిత్ కంటే కోహ్లీకి శతకం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నా" అని వివరించాడు. ఈ సిరీస్ హోరాహోరీగా సాగుతుందని పుజారా అంచనా వేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని, వర్షం కారణంగా ఓ మ్యాచ్ రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆడే భారత జట్టు, చివరి రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగే జట్టు వేరుగా ఉండనుండటం న్యూజిలాండ్‌కు కొంత అనుకూలిస్తుందని అభిప్రాయ పడ్డాడు. అయితే తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు మెరుగ్గా రాణిస్తుందని పుజారా విశ్వాసం వ్యక్తం చేశాడు. చివరి రెండు మ్యాచ్‌లు టీమిండియాకు కొంత సవాలుగా మారవచ్చని అన్నాడు. న్యూజిలాండ్‌లో వర్షాలు కూడా మ్యాచ్‌ల ఫలితాలపై ప్రభావం చూపవచ్చని పేర్కొన్నాడు.

ఏఐకి భౌతిక రూపం..

'మ్యాక్స్' హ్యూమనాయిడ్ రోబోను పరిచయం చేసిన మెటా!



టెస్లా ఆప్టిమస్, ఫిగర్ వంటి రోబోలకు పోటీగా మెటాను నిలబెట్టే ప్రయత్నం అమెరికా–చైనా ఉద్రిక్తతల నడుమ ఈ భాగస్వామ్యంపై టెక్ వర్గాల్లో ఆసక్తి సోషల్ మీడియా దిగ్గజం మెటా ఇప్పుడు సరికొత్త రంగంలోకి అడుగుపెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను (ఏఐ) కేవలం స్క్రీన్లకు, యాప్‌లకు పరిమితం చేయకుండా దానికి ఒక భౌతిక రూపాన్ని ఇచ్చేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా చైనాకు చెందిన రోబోటిక్స్ స్టార్టప్ 'ఫోరియర్' సహకారంతో 'మ్యాక్స్' అనే హ్యూమనాయిడ్ రోబో ప్రోటోటైప్‌ను కేవలం మూడు నెలల వ్యవధిలోనే అభివృద్ధి చేసి టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని మెటా, తన ఏఐ ఏజెంట్ 'మ్యూజ్'కు భవిష్యత్తులో భౌతిక రూపాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టింది. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న ఈ రోబో, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఉండే ఏఐ చాట్‌బాట్‌ల మాదిరి కాకుండా, మనుషులతో నేరుగా సంభాషించగలదు, స్పందించగలదు.

'మ్యాక్స్' ప్రత్యేకతలు ఏమిటి?

'మ్యాక్స్' రోబో దాదాపు 5 అడుగుల ఎత్తు, 48 కిలోల బరువు ఉంటుంది. దీనికి మనుషుల్లాగే ఐదు వేళ్లతో కూడిన చేతులు, మాట్లాడేందుకు స్పీకర్లు, హావభావాలను ప్రదర్శించేందుకు ముఖం స్థానంలో ఒక స్క్రీన్ ఉన్నాయి. ఇది కేవలం ఫోరియర్ రోబోకు మెటా లోగో తగిలించడం కాదు. ఫోరియర్ హార్డ్‌వేర్‌ను వాడుకుంటూనే, మెటా తన అవసరాలకు అనుగుణంగా రోబో ఎత్తు, డిజైన్, తల, కెమెరాలు, చేతులు, పాదాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దింది. మెటా నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం, ఈ రోబో 5 మీటర్ల దూరం నుంచి మనిషి గొంతును గుర్తించగలగాలి. 3 మీటర్ల దూరం నుంచి చేతి సైగలను అర్థం చేసుకోవాలి. సంభాషిస్తున్నప్పుడు కళ్లలోకి చూస్తూ మాట్లాడాలి. తాను వింటున్నానా, ఆలోచిస్తున్నానా, మాట్లాడుతున్నానా లేదా గందరగోళంలో ఉన్నానా అనే సంకేతాలను తన ముఖంలోని స్క్రీన్ ద్వారా తెలియజేయాలి. ఈ రోబో ఎన్విడియా జెట్సన్ థోర్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్‌పై పనిచేస్తుంది. చిన్న వస్తువులను, బొమ్మలను చేతులతో పట్టుకోగలదు.

భవిష్యత్ ప్రణాళికలు, పోటీ

మెటా ఇప్పటికే 'మ్యాక్స్' రెండో వెర్షన్‌పై పనిచేయడం ప్రారంభించింది. ఈ కొత్త మోడల్‌లో చేతుల పనితీరును మెరుగుపరచడం, మెట్లు ఎక్కేందుకు అదనపు సెన్సార్లు, విజువల్స్ ప్రదర్శించేందుకు ప్రొజెక్టర్ వంటివి అమర్చనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ రోబోలను వాణిజ్యపరంగా విక్రయించే ఆలోచన లేదని, అంతర్గత పరిశోధనల కోసమే వీటిని అభివృద్ధి చేస్తున్నామని మెటా ప్రతినిధి తెలిపారు. అయితే, భవిష్యత్తులో పూర్తిస్థాయి ఉత్పత్తిగా మార్కెట్లోకి తెచ్చేందుకే ఈ ప్రయోగాలు జరుగుతున్నాయని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం హ్యూమనాయిడ్ రోబోల రంగంలో తీవ్రమైన పోటీ నెలకొంది. ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా 'ఆప్టిమస్', ఫిగర్ కంపెనీ రోబోలు, 1ఎ టెక్నాలజీస్ వారి 'నియో' వంటివి ఇప్పటికే ఈ రేసులో ఉన్నాయి. వీటికి గట్టి పోటీ ఇచ్చేందుకే మెటా సన్నద్ధమవుతోంది.

అమెరికా–చైనా మధ్య ఏఐ సాంకేతికత విషయంలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, మెటా ఒక చైనా కంపెనీతో చేతులు కలపడం గమనార్హం. జాతీయ భద్రతా కారణాలతో చైనా హ్యూమనాయిడ్ రోబోల దిగుమతిపై అమెరికా ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో ఈ భాగస్వామ్యం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేమైనా ఏఐని వర్చువల్ ప్రపంచం నుంచి వాస్తవ ప్రపంచంలోకి తీసుకురావాలన్న జుకర్‌బర్గ్ సంకల్పానికి ఈ 'మ్యాక్స్' రోబో తొలి అడుగుగా నిలుస్తోంది.

ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో గుడ్‌న్యూస్..

-పీఎఫ్ సేవలు ఇక మీ వాట్సాప్‌లోనే

-వాట్సాప్‌లో పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకునే సదుపాయం ప్రారంభం

-చివరి ఐదు లావాదేవీల వివరాలూ అందుబాటులోకి

-పీఎఫ్ పాస్‌బుక్ సమాచారాన్ని కూడా పొందే వీలు

-రూ.1,000లోపు నిలిచిపోయిన ఖాతాలకు ఆటోమేటిక్ సెటిల్‌మెంట్

-ఆధార్, బ్యాంకు వివరాల ధ్రువీకరణ తప్పనిసరి

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారులకు శుభవార్త. ఇకపై వాట్సాప్ ద్వారానే పీఎఫ్ ఖాతాలో ఎంత డబ్బు ఉందో తెలుసుకోవచ్చు. ఖాతాలో ఇటీవల జరిగిన ఐదు లావాదేవీల వివరాలను చూడటంతో పాటు పీఎఫ్ పాస్‌బుక్ సమాచారాన్ని కూడా పొందవచ్చు. ఈ కొత్త సదుపాయాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సేవలతో సాధారణ ఖాతా వివరాల కోసం ఈపీఎఫ్ కార్యాలయాలను సంప్రదించాల్సిన అవసరం తగ్గనుంది. ఈ సేవలను వినియోగించుకునేందుకు చందాదారులు ఈపీఎఫ్‌వో అధికారిక వాట్సాప్ సేవను మాత్రమే ఉపయోగించాలి. అందుబాటులో ఉన్న సేవల్లో పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకోవడం, చివరి ఐదు లావాదేవీలను పరిశీలించడం, పాస్‌బుక్ వివరాలను పొందడం ఉన్నాయి. 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎంవీబీఆర్‌వై)కు సంబంధించిన అవసరాలను పూర్తి చేసేందుకు వ్యక్తిగత మార్గదర్శకత్వం, సహాయం కూడా ఈ సేవ ద్వారా అందించనున్నారు. వాట్సాప్ సేవతో పాటు మరో కీలక నిర్ణయాన్ని ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఆధార్ ధ్రువీకరణ పూర్తయిన, నిలిచిపోయిన పీఎఫ్ ఖాతాల్లో రూ.1,000 లేదా అంతకంటే తక్కువ మొత్తం ఉన్న అర్హులైన చందాదారులకు డబ్బు తిరిగి చెల్లించే ప్రక్రియను ఆటోమేటిక్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకోసం చందాదారులు ప్రత్యేకంగా క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం ఉండదు. అయితే గుర్తింపు, బ్యాంకు ఖాతా వివరాల ధ్రువీకరణ పూర్తయ్యాకే ఈ ప్రక్రియ చేపడతారు. ఈ సదుపాయం ద్వారా సుమారు లక్ష ఖాతాలకు చెందిన రూ.5 కోట్ల వరకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా.

